# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 07-08-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఉప రాష్ట్రపతి ఎన్నికకు సంబంధించిన నోటిఫికేషన్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ఈరోజు విడుదల చేయనుంది**
2. **గుంటూరుజిల్లా మంగళగిరిలో ఈరోజు నిర్వహించే జాతీయ చేనేత దినోత్సవంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాల్గొంటారు.**
3. **ఆంధ్రప్రదేశ్‌లో ఐటీ సంస్థలు ఏర్పాటుకు ఏపీ ల్యాండ్ ఇన్సెంటివ్ ఫర్ టెక్‌హబ్ పాలసీకి రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది.**
4. **తెలంగాణ ప్రభుత్వం తీసుకువచ్చిన 42శాతం రిజర్వేషన్ల బిల్లులను కేంద్ర ప్రభుత్వం ఆమోదించాలని ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి కోరారు.**
5. **ఖేలో ఇండియా తరహా క్రీడల కోసం విశాఖపట్నంలో థీమ్ పార్కును ఏర్పాటు చేస్తామని ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు.**

=========================

ఉప రాష్ట్రపతి ఎన్నికకు సంబంధించిన నోటిఫికేషన్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ఈరోజు విడుదల చేయనుంది. ఇప్పటికే ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ ఎన్నికల నామినేషన్ల దాఖలకు ఈ నెల 21 చివరి తేదీగా పేర్కొంది. అనంతరం నామినేషన్ల పరిశీలన ఈ నెల 22 వరకు జరుగుతుందని, నామినేషన్ల ఉపసంహారణకు 25వ తేదీ వరకు గడువు ఉంటుందని తెలిపింది. వచ్చే నెల 9న ఉదయం 10 గంటలనుండి సాయంత్రం 5 గంటల మధ్య పోలింగ్ జరుగనుండగా, అదే రోజు లెక్కింపు జరుగుతుందని ఎన్నికల సంఘం వివరించింది. కాగా అనారోగ్య కారణాలతో జగదీప్ ధన్ ఖడ్ రాజీనామా చేయడంతో ఉప రాష్ట్రపతి ఎన్నికను నిర్వహిస్తున్నారు.

-------------------------

భారత్‌లో చేనేత రంగం దేశ సుసంపన్నమైన, వైవిధ్యమైన సాంస్కృతిక వారసత్వానికి చిహ్నంగా నిలుస్తోంది. భారత స్వాతంత్రోద్యమంలో ప్రధాన భూమిక పోషించి, స్వాతంత్ర్య సముపార్జనకు ఒక సాధనంగా నిలిచింది 'చేనేత'. గాంధీజీ సైతం రాట్నంపై నూలు వడకేందుకు అత్యంత ప్రాధాన్యతనిచ్చారు. అంతటి ప్రాధాన్యత కలిగిన చేనేత రంగానికి ప్రత్యేకంగా ఒక రోజు ఉండాలన్న ఉద్దేశ్యంతో జాతీయ చేనేత దినోత్సవాన్ని ఏర్పాటు చేశారు. 1905లో ప్రారంభమైన స్వదేశీ ఉద్యమంలో స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలనే చారిత్రాత్మక పిలుపుకి గుర్తుగా చేనేత ప్రాశస్త్యాన్ని చాటేందుకు 2015లో ఆగస్టు 7వ తేదీని మొదటి జాతీయ చేనేత దినోత్సవాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభించారు. చేనేత కార్మికులతో సహా దేశీయ పరిశ్రమలను ప్రోత్సహించడం, చేనేత ప్రాముఖ్యత

వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించేలా ఈరోజు దేశవ్యాప్తంగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరు జిల్లా మంగళగిరిలో నిర్వహించే 11వ జాతీయ చేనేత దినోత్సవం కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొంటారు. ఈ సందర్భంగా మంగళగిరిలో చేనేత ఉత్పత్తులతో ఏర్పాటు చేసిన స్టాళ్లను ముఖ్యమంత్రి పరిశీలించి చేనేత కుటుంబాలతో ముఖాముఖి మాట్లాడనున్నారు. అనంతరం చేనేత కార్మికులకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇచ్చే పథకంతో పాటు, చేనేత దుస్తులపై జీఎస్టీ మినహాయింపు పథకాన్ని ప్రారంభిస్తారు. తర్వాత ప్రజా వేదిక సభలో పాల్గొని ప్రసంగించనున్నారు. కాగా ముఖ్యమంత్రి కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేశామని అధికారులు తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఐటీ సంస్థలు ఏర్పాటుకు ఏపీ ల్యాండ్ ఇన్సెంటివ్ ఫర్ టెక్‌హబ్ పాలసీ 4.0కు రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన నిన్న అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశ నిర్ణయాలను సమాచార, ప్రజా సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి పాత్రికేయులకు వెల్లడించారు. ఐటీ సంస్థలు ఏర్పాటు చేసేవారికి అన్ని సదుపాయలను ప్రభుత్వం కల్పించనుందని తెలిపారు. చేనేత మగ్గాలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ తో పాటు నాయీబ్రాహ్మణులకు ఉచిత విద్యుత్ అందించేలా మంత్రి వర్గం ఆమోదం తెలిపిందని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ 34 సెకన్లు

---------------------------

తెలంగాణ ప్రభుత్వం తీసుకువచ్చిన 42శాతం రిజర్వేషన్ల బిల్లులను కేంద్రం ప్రభుత్వం ఆమోదించాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి కోరారు. ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో నిర్వహించిన ధర్నాలో ముఖ్యమంత్రి నిన్న ప్రసంగించారు. దేశవ్యాప్తంగా చేపట్టే జనగణనలోతెలంగాణ కులగణన నమూనా దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని చెప్పారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు 50 శాతం దాటొద్దని పరిమితి విధిస్తూ చేసిన చట్టాన్ని సవరిస్తూ జారీ చేసిన ఆర్డినెన్స్ ను ఆమోదించాలని ముఖ్యమంత్రి కోరుతూ,

వాయిస్ 27 సెకన్లు

---------------------------

ఖేలో ఇండియా తరహా క్రీడల కోసం దేశంలోనే మొదటి థీమ్ పార్కును 35 కోట్ల రూపాయలతో విశాఖపట్నంలో ఏర్పాటు చేస్తామని ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో పలువురు పెట్టుబడిదారులతో మంత్రి నిన్న సమావేశమై వారి ప్రతిపాదనల్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఐరోపా, హాంకాంగ్ తరహా థీమ్ పార్కులను రాష్ట్రంలో ఏర్పాటు చేస్తామన్నారు. హైదరాబాద్‌లోని ఎక్స్ పీరియం బొటానికల్ గార్డెన్ తరహా పార్కును అమరావతి పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తామని మంత్రి తెలిపారు.

---------------------------

ముడి పామాయిల్‌పై దిగుమతి సుంకం తగ్గింపుపై పునరాలోచించాలని కేంద్ర ప్రభుత్వాన్ని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. ఢిల్లీలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో మంత్రి నిన్న మర్యాదపూర్వకంగా సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా, ముడి పామాయిల్‌పై దిగుమతి సుంకాల తగ్గింపు ప్రభావం తెలంగాణ ఆయిల్ పామ్ రైతులపై పడుతోందని చెప్పారు. ఈ ఏడాది 50 వేల హెక్టార్లలో ఆయిల్ పామ్ సాగుకు 18 వేల 185 మంది రైతులు ఇప్పటికే నమోదు చేయించుకున్నారని వివరించారు. దిగుమతి సుంకాన్ని 44 శాతం విధించేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు మంత్రి విజ్ఞప్తి చేశారు

--------------------------

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా సికింద్రాబాద్ నుంచి మైసూరుకు.. చర్లపల్లి నుంచి కాకినాడకు ప్రత్యేక రైళ్లు నడపనున్నామని దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. 07033 నెంబర్ గల సికింద్రాబాద్–మైసూరు ప్రత్యేక రైలు రేపటి నుంచి ఈ నెల 29 వరకు ప్రతి సోమ, శుక్రవారాల్లో రాత్రి 10 గంటలకు బయల్దేరుతుందని తెలిపింది. 07034 నెంబర్ గల మైసూరు–సికింద్రాబాద్ రైలు ఈ నెల 9 నుంచి 30వ తేదీ వరకు మంగళ, శనివారాల్లో సాయంత్రం 5 గంటల 20 నిమిషాలకు ప్రారంభమవుతుందని తెలిపింది.

అలాగే 07031 నెంబర్ గల చర్లపల్లి–కాకినాడ రైలు రేపు రాత్రి 7 గంటల 30 నిమిషాలకు.. 07032 నెంబర్ గల కాకినాడ–చర్లపల్లి రైలు ఈ నెల 10వ తేదీ ఆదివారం రాత్రి 8 గంటల 10 నిమిషాలకు బయల్దేరుతుందని దక్షిణ మధ్య రైల్వే పేర్కొంది.

--------------------------

ఉత్తర తమిళనాడు తీరం, రాయలసీమ పరిసర ప్రాంతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి ఎమ్.వెంకట్రావు తెలియజేస్తూ....

వాయిస్...17 సెకన్లు

మరోవైపు తెలంగాణలోనూ రానున్న మూడు రోజులపాటు పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లో జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులకు ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేలా నిర్ధిష్ట ప్రణాళికలు రూపొందించాలని పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో మంత్రి అధ్యక్షతన జాతీయ రహదారులు, రైల్వే శాఖ ఉన్నతాధికారులతో 3 వ టాస్క్ ఫోర్స్ కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు. ప్రాజెక్టుల నిర్మాణానికి భూసేకరణ, అటవీ అనుమతులు, ఇతర సమస్యలు త్వరగా పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకువచ్చిన గ్రీన్ ఎనర్జీ విధానంతో సౌర, పవన శక్తి రంగాల్లో పెట్టుబడులు వస్తున్నాయని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. విజయవాడలో నిర్వహించిన గ్రీన్ ఎనర్జీ సదస్సులో మంత్రి పాల్గొని మాట్లాడుతూ, రాష్ట్రంలో 160 గిగా వాట్స్ పునరుత్పాదక శక్తి లక్ష్యంతో ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందన్నారు. యువతకు ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా వృత్తి నైపుణ్యాలలో శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. రానున్న రోజుల్లో గ్రీన్ ఎనర్జీ లో యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని మంత్రి వివరించారు.

-------------------------

ఉద్యోగ భవిష్య నిధి- ఈపీఎఫ్ చందారులకు ఈపీఎస్-95 కింద ఇచ్చే ఫించన్ సమస్యలను పరిష్కరించాలని కేంద్రమంత్రి మన్సుఖ్ మాండవీయను విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు శ్రీభరత్ కోరారు. ఢిల్లీలో నిన్న కేంద్ర మంత్రితో ఎంపీ సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రైవేట్ రంగాల నుంచి పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు ఫించన్ మొత్తం పెంపు, చెల్లింపుల వేగవంతం తదితర అంశాలను పరిష్కరించాలని కోరారు.

=====================